కుంపటి

అందుగుల మొండయ్య

1

ఉసిల్లపుట్ట బెదిరినట్టు- ఎటు సూసిన జనం....

పెడీపెడీన కేకలు- అరుపులు....

"దున్నేవాడిదే భూమి"

"రైతుకూలి సంగం వర్ధిల్లాలె"

"దొరల జులుం నశించాలె"

"ఎట్టి పనులు రద్దుగావాలె"

అంకరుమాల్లు జుట్టుకొని బరికాల్లతోటి రైతులు- పెయికంగిలేని దుబ్బనిండిన మొఖాలతోటి రైతుకూలీలు- ఏడి పనులాన్నే ఆపచ్చిన పనులోల్లు- వాడలు దద్దరిల్లేటట్టు మొగులు ముట్ట కేకలేసుకుంట- మెడనరాలుబ్బంగ పాటలు పాడుకుంట- నడుత్తంద్రు.

ఎర్రజండాలు రెపరెపలాడ్తన్నయ్- అళ్ళ కండ్లల్ల ఎర్రజీరలు కదులుతన్నయ్- ఎర్రజెండాలమీద అక్కారిబిక్కారి దించిన సుత్తికొడువళ్ళు....

ఊరేగింపు తోటట్టుగ తలలు వేలాడేసుకొని అడుగేసుడే బమ్మకట్టమయినట్టు, సేసుకున్న కర్మానికి సెరిగడిసేపనే రీతిల, ఏ సందుల ఏం ముంచుక రాగలదనే బుగులుతోటి ఊడ్డు మొఖాలతోటి ఊక్కుంట పోలీసోల్లు నడుత్తండ్రు.

ఊరేగింపు వాడవాడలు దిరిగి దుకానదార్ల తలలు దిమ్మెక్కేటట్టు కేకలుబెట్టి- మైదానంల కచ్చింది.

వాసపు కొయ్యలతో గట్టిన స్టేజీమీద ఎవలో కంచుకంఠంతోని ఉపన్యాసం ఇత్తండు.

"ఓరి నీయవ్వ గిట్లుంటదని మాకు ముందుగా ఎందుకు సెప్పలే- ఎర్రజండలు లేక తల గొట్టేసినట్టయ్యింది" ఓ పెద్దన్న దుబ్బల కూలబడి అన్నడు.

"మర్కోపారికి తెచ్చుకుందాం లేయే" ఇంకో పెద్దన్న....

"గబ్బెల్లయిద్ధి....?"

మీటింగుల గుసగుసలు....

ఇంకోకాడ అయితారప్పేట రైతులు- రైతుకూలీలు కూకున్నరు. అళ్ళ కిదం తేందో కొత్తగనిపిత్తంది.

878

అళ్ళ ఊరుమీనికెళ్ళి రంగపురం రైతులు రాంగ అళ్ళతోని కూడచ్చింద్రు.

"ఔనే భీమన్న మనూరి దొరోడు లంజకొడుకు లావు సెల్లిచ్చుకుంటండు గాదే!"

"సిన్నంగంటన్నవా ! వానసొంటి బద్దుమాషి దునియల లేడు- ఎట్ల బుట్టిండో పాపపు లంజకొడుకు- వానవ్వ- మనూల్లె ఏ కోడి పుంజు గూతబట్టిన ఆనింటికే బోవాల్నాయె."

"సెడి సెల్లిచ్చుకున్నోడు సెర్లు కుంటలు బట్టి ఉరుకాలె...."

భీమయ్య అంక రుమాలు సదురుకున్నడు.

"ఏవూరు మంది పెద్దన్నా ?" రంగపురం రాయేశం అడిగిండు.

"అయితారప్పేట...."

"సంగతేందోంట...."

"సంగతేమున్నది.... ఏడ సూసినా ఏడే మానుకలు- మా వూళ్ళె మాదండి మాదెరసోదోడున్నడు- ఇరుకనియ్యడు కొరుకనియ్యడు- ఊళ్ళె భూములన్ని ముద్ది కిందేసుకొని మీసాలు దిద్దుతండు- ఆనితోని మాలావు సావచ్చింది."

"వానవ్వ గొడ్లగోసే దొరోడు- వాని సందాల వాడుంటే బాగనే ఉండు- ఆడు ఎర్రి కుక్కసొంటోడు- నడుసుకుంట నడుసుకుంటనే మెలుగుల్ తప్పదీత్తడు- అడుగు దీసి అడుగేసేటాల్లకు ఎవని గుడిసెకో ఉగ్గం బెడ్తడు- గొడ్డుబర్లకు బంధాల్ బోసి పాలుబిండే రకం. మిలమిల సూడంగ నిరుడు గీ ఉద్దేడు నలుగురిని ఊళ్ళె నుంచి ఎల్లగొట్టిండు."

"సైసు.... సైసు...." భీమయ్య.

"అంతలావు మొగోడా !"

'ఓ నీ బాంచెనాతే ఏం జెప్పవశం.... నీ కాళ్లమొక్కుత ఆనికింద నలుభై మంది కారు దున్నపోతుల సొంటోల్లున్నరు. లొట్లకులొట్లు తాగిత్తడు. తాగిగ్రనంటె వాళ్లింట్ల పిన్నెల్ల-ఇగ ఆళ్లకు అద్దుపద్దులేదు.' భీమయ్య పక్కకు కూకున్న ముక్కు పోగు ముత్తవ్వ అందుకున్నది.

మీటింగుల ఎవలో పాటపాడుతండు.

"గదినుండి, అటెన్క తీరు పాటంగ ముచ్చెట్లు బెట్టుకునేరు...." ఎవలో గునిసిండ్రు.

రంగపురపు రాయేశం భీమయ్య దగ్గెరికి జరిగిండు.

"మరి గట్ల ఆడు సేత్తంటె ఊళ్లనోల్లంత ఏంజేసిండ్రు"

"ఏంజేత్తం....?"

879

"అందరొక్కటయితె...."

"మా అయితంగని రేపు మంచే జరుగుతది. సెడ్డే జరుగుతది. జర మాట సాయానికన్న ఎవలన్న ఎనుకుండద్దా?"

"ఊళ్లే జరంత ఉన్నోళ్లు గిన్నోళ్లు ఎట్లుంటరు. దొరపట్టేనా మీ పట్టా?"

"ఆనికి అందరొక్కటే- ఎవలను ఇడిసి పెట్టలే- అందరిని దొరికిన కాడికి బరుక్కున్నడు. ఓ! ఏంజెప్పాలే-ఆడుసేసిన పాపపు పనులు-కోడి లేంది ముద్దెత్తడు. గ కోడి పుక్యానికే రావాలే- బరండి కీస లేంది బజారెల్లడు. గ బరండి కీసకు జెబుల కొత్తలు బెట్టద్దు. నాత్రయ్యిందంటే కొత్తపోరి గావాలె-అయ్యా! ఏం జెప్పాలే సెప్పకుంటె మానం బోతది-సెప్పకుంటె పానం బోతది....ఎంతకని....సీతల్లి బతుకవ్వ.... ఆడికి, ఊళ్లోల్లందరం పోలీసోల్ల సుట్టు కాలుకు బలుపం గట్టకుంట దిర్గినమ్. ఆడికి పోతే అదేతంటు- సుట్టమయి పోతే దయ్యమయి పట్టినట్టు- 'లావ్....లావ్' మని పాములు తేళ్ళు బారిచ్చిరి. ఏడికి బొయిన ఏడే మానుకలు మా కర్మం గిట్లున్నదని కడుపుల మంట కడుపుల్నే కుక్కుకున్నం. సుట్టు పక్కల గిట్లయితందంటే, గీడే మున్నదోనని గీడికురికచ్చినమ్....

"గిదంత సూత్తంటే ఏమని పిత్తంది?"

"గిప్పటికి మన కట్టసుకం ఇనే మొనగాళ్లు బయిలెల్లింద్రని పిత్తంది."

రాయేశం లేసి నిలబడి "నాతో రమ్మని" సైగ చేసిండు. భీమయ్య ముడ్డికింది పంచె దులుపుకొని రాయేశం ఎంట బడ్డడు. అయినెనుక అయిదారుగురు రైతులు నడిసింద్రు. స్టేజీ దగ్గెరికి తీసుక పోయిండు. ఎవలనో పిలుసుకచ్చిండు....సానాసేపు మాట్లాడిండ్లు.

"తమరు రాకుంటె కలువది." భీమయ్య మొక్కిండు.

"నే నత్తపాయే....భీమన్న...." రాయేశం భీమయ్య ఎన్ను నరిసిండు.

2

ఊడల మర్రికింద సిక్కటి సీకటి పేరుకున్నది.

సీకట్ల మర్రికింద కూరుకుపట్లు పడుకుంట యాభయి మంది గుసగుస లాడ్తండ్రి.... ఎలుగురాసిన గొంతికెలతోటి ఏందేందో సెప్పుకుంటుంద్రు-

నడిఝాము తిరిగి పోయింది. దూరంగ ఊళ్లె కరంటు బుగ్గలు కొరివి దయ్యాల తీర్గ ఎల్గుతన్నయ్.

"ఏమాయె భీమప్ప పెద్ద పోకిల్లు గొడ్తివి- నడిఝాము తిరిగి పోనచ్చె- అత్తనన్నోల్లు రాకపోయిరి- ఊళ్లె ఉలిలయి పోయింది. అట్టి బొక్కలకు కొంద్రిగాడు

880

దెబ్బలు తిన్నట్టయ్యింది. మందిల పిత్తైటోదెవడన్న మనందరి పేర్లు దొర కాడ ఊదుంటడు. రేపు దొర ఒక్కొక్కన్ని బంకుల్లకు పిలిసి మిలమిల సూడంగ తోలు పికుల గొడ్తడు.'' పెంటయ్య లేసి నిలబడ్డడు.

భీమయ్య భీరిపోయి మర్రికొరిగిండు

"అదిగాదుగని- నాకెరుక లేకడుగుత- అంతలావు దమ్ములుంటే నీ యక్క పీక్క పోయిందేంది? కూడినోల్లం ఎట్టయిన కూడినం. బదునామయినోల్లం బదునామయితిమి. మనమే గిది గుర్రం గిది మైదాన మనుకుంటెగాదా! నా లంజెపిచు మల్లమల్ల తల్లి కడుపుల బుట్టబోతమా!"

"రోజు సచ్చే సావేనాయె- రోజు సచ్చెటోనికి ఎవదేడుత్తడు. కానియ్యండ్లి...."

"ఇదీ మంచి మాటే...."

లచ్చయ్య ఏడేడ తను ఏమేమి సూసింది సెప్పుకచ్చిండు ఇలెవరిసె బెట్టి.

"కట్టంటె- కష్టే.... రేపు అందరం దొరింటికి బోదాం. మంచి మాటకు పరంపోగులు దున్ను కుంటమని అడుగుదాం- పాలేరోల్లు, సాకలోడు, మంగలోడు అంత బందు.... పాలేరోల్లకు అయిదు నూర్లు అడ్డి లేకుంటియ్యాలె- అయిదు గుంచాల జొండ్లు నెల జీతం గొలువాలె- అయిదు గిద్దెల పెట్టుబడి- గొంగడి సెప్పులు- లంజ కొడుక లవుకకొడుకని ఎగిరిందో- అందరం పనిబందు...."

"ఇంటడు సరేసరి- ఇనడు సూత్తాం- నాగండ్లకు ఎవడడ్డమత్తదో సూత్తాం."

అంతట్లకే నలుగురు మనుషులచ్చిండ్రు- రాయేశంను సూసి భీమయ్య సంబుర పడ్డడు

"కాలినడకన అచ్చెటాల్లకు కూసంత ఆలిస్యమయ్యింది" రాయేశం.

రాయేశం సానాసేపు సెప్పుకచ్చిండు- ఆఖరుగ 'సంఘం' బెట్టుకోవాల్నన్నడు.

సంఘం ఏర్పడ్డది- భీమయ్య సంఘం పెద్దయ్యిండు.

ఇగ లేవబోదామనేటాల్లకే ఈదుల్లనుంచి 'ఝుయ్య ఝుయ్య'న ఈలలినచ్చినయ్.

కండ్లుమూసి తెరిసెటాల్లకే దుడ్లుబట్టుకొని దొర మనుషులు రైతులమీన బడ్డరు- పెడీపెడీన దెబ్బలు- మొత్తుకోల్లు- లొల్లి- ఎటోల్లటురికిండ్లు....

సేతుల్లేమి లేకుంటున్న రైతులు- కూలోల్లు సొడసొడ నెత్తుర్లు గారంగ ఉరికిండ్లు.

881

రాయేశం, మరో నలుగురు రైతులు దొరికి పోయిండ్లు.

3

రామేశం ఎంటచ్చిన ముగ్గురు రైతులు-

"అయితారంపేట దొరోడు ఊపనిండా గుండగాళ్ళను దించి ఊరును కాష్నాల గడ్డ జేసిండు. ఇండ్లల్ల జొచ్చి పిల్లల మేకల సావగొడ్తండ్రు- అళ్ళు మనసొంటి కూటికి లేనోల్లే- అళ్ళిప్పుడు మంటలున్నరు- అదు ఇయ్యాల్ల అనూల్లె జేత్తే రేపు మనూల్లల్ల దొరోల్లు తోకలు మిడకొడుతరు- గరీబోల్లకు గరీబోల్లం మద్దతుబోకుంటె ఇంకెవలు బోతరు."

ఊరూరికి సెప్పిండ్లు....

"ఔ నిచ్చమే...."

"పా.... అంటే పాండ్లి...."

4

ఆనాడు నెత్తురు వూసుకొని పొద్దుపొడిసింది-

రంగారావు దొర నెత్తంత సెదిరి, మొఖంమీన సూనెపేరి కుర్సిల పరేషాన్ల కూకున్నడు- తాగి తాగి కండ్లు నిప్పుల తీర్గయినయ్- గుండగాల్లు పట్టుకచ్చిన రైతులను గడీల కొయ్యలు పాతిచ్చి జనుపగిర్ర సేర్లతోటి కట్టేపిచ్చిండు- అళ్ళ పెయ్యంత కమిలి, నెత్తురు కార్తంది.

"లద్ది కొడుకుల్లాలా.... ఎక్కడిదిరా మీ బలిజం.... కమినిట్ల బలమారా ! పోలీసోల్ల బిలిపిచ్చి తుపాకి సేపిత్త.... కూలి లంజకొడుకుల్లాలా...." దొర మొరిగి మొరిగి ఇంట్లకు నడిసిండు.

పక్కీరు సాయెబు అఖరిసారిగ రామేశం దవుడమీన గుద్దిండు.

రామేశం కాండ్రకిచ్చి ఊంచిండు....

"కుక్కా ! ఎప్పటికి మీ కాలముండదిరా ! మా కాలం సుత అత్తది...."

పక్కీరు సాయెబు కిసకిస నవ్వి ఊరవతలి అగు మొఖాన నడిసిండు- కండ్లు మండుతన్నయ్.... "కడుపుల మంట- సారాలేంది ఎల్లేటట్టుగ" లేదనుకుంట.

అంగి నడుత్తన్నోడు ఎందుకనో నిలుసుండి ముంగటికి సూసిండు- 'యాఅల్లా' అన్నడు- పుట్టగడ్డెక్కి పొద్దుకు సేతులడ్డంబెట్టి సూసిండు- నేల ఈనింది....

మూరెడు మూరెడు పరకల పుల్లలేసుకొని- అంక రుమాలోల్లు, పెయి కంగి లేనోల్లు, పెద్దపెద్ద మీసాలోల్లు, మొఖాలు కడుగుతంద్రు- కొందరు సద్దులు తింటండ్రు- ఉసికె గన్పియ్యకుంట జనం.... ఆడోల్లు పెలిమెలు జల్లుతంద్రు- సేతుల్ల గుతుపలు, గొడ్డండ్లు, ముల్లుగట్టెలు.

పక్కీరు సాయెబుకు పానమెల్లిపోయింది.

ఎనుకకు మర్రిసూడకుంట కాల్లకు లుంగిపేగు తట్టుకోంగ ఉరికిండు- దొర పడారి గోడల కచ్చి ఎగపోసుకుంట నిలుసున్నడు.

దాసిది రాక ఆకిలి ఊడ్వకుంటున్నది- ఈవరకే అలుకు జల్లి ముగ్గుబెట్టేది.

మంగలోడు రాక బంకుల్ల కంజీన ఇంక ఎలుగుతనే ఉన్నది.

కుర్సిల దొర లేడు-

అదే కాళ్ళమీన లోగింట్ల కురికిండు.

దొర పట్టెమంచంల అడ్డదిడ్డంగ పన్నడు- సేతుల బరండి కీసున్నది-

దొర్సాని ఎదురయ్యింది-

"నీ బాంచెన్ ఏవున్నది- దొరను జర లేపుండ్లి...."

పక్కీరు సాయెబు ఎగపోత్తుండు.

దొర్సాని ఎగదిగ సూసి ఆడినుంచి ఎల్లిపోయింది.

దొర లేపకుంటనే లేసిండు- సీస పారేసి సికిలేటు ముట్టిచ్చిండు- సొలుక్కుంటనే బంకుల్ల కచ్చిండు.

పక్కీరు సాయెబు సలిజరం గొట్టినోని తీర్గ అనుక్కుంట తను సూసింది చెప్పిండు.

దొర సేతుల సికిలేటు కిందబడ్డది.

"ఉరుకు, అందరిని పిల్సుకరా!"

దొర మేడమీది కురికి తుపాకి లోడుసేసుకున్నడు.

ఎందుకనో తుపాకి సేతులుండంగనే దొర మీసాలదురుతన్నయి- ఎక్కన్నో బుగులు- తుపాకి పేతబట్టుకొని మళ్ళో బరండి కీస మూతికాడ బట్టిండు- కాళ్ళు దేవుడు పూనినట్టుగ అనుకుతన్నయ్....

883

నలుభై మందచ్చెటాల్లకు దొరకు ధైర్నమచ్చింది.

"బోల్లు బొక్క లవుతల పారేసినం.... కనిపిచ్చినోన్నల్ల తన్నినం– ఊరంత ఉచ్చబోసుకుంటంది–" బొందిగాడు దొర మొఖంలకు ఆశగా సూసిండు.

"తొత్తు కొడుకులు రానీయ్– వానవ్వల కుక్కల్ దెం.... పక్కీరు, నువ్వురికి పోలీసోల్లకు జెప్పు– శంకరిగా, సుక్కా.... మీరిద్దరు సెరో తుపాకందుకోండ్రి...." దొర ఏగిరపెట్టిండు.

జనం ఊళ్ళె సొరనే సొచ్చిండ్లు–

"దున్నేటోనిదే భూమి...."

"రంగారావు దౌర్జన్యం నశించాలె...."

"పట్టుకున్న రైతులను విడిచిపెట్టాలె...."

"పరంపోగులు దున్నుకోవాలె...."

"ఎట్టి నాగండ్లు రద్దుగావాలె...."

"తీసుకున్న దండుగులు ఎల్లగక్కాలె...."

పెడీ పెడీన కేకలు.... ఎవలో బొంగురు గొంతోడు "ఏ పొక్క సొచ్చిన ఇడువంరో.... మా రెక్కల కట్టం దోసినోడా! ఎర్రి కుక్కోలె మొరిగినోడా! మే మడిగేదానికి జవాబు చెప్పు" పాట పాడ్తుండు– సానామంది సప్పట్లు గొట్టుకుంట పాటను గొంతెత్తి పాడ్తుండ్రి....

గెఫీ గెఫీన అడుగులు.... కాళ్ళ దుమ్ము ఆకసంలకు లేత్తంది– పోరగండ్లు పిల్లిమొగ్గ లేసుకుంట ముంగట నడుత్తండ్రు.... ఆడోల్లు శాపనార్థాలు పెట్టుకుంట నడుత్తండ్రు.

పాయె– అయిపాయె– ఊళ్ళున్న జనానికి పూనకమచ్చింది– కుంటి, గులాపు, ఉన్నోడు, లేనోడు అందరు ఆ మందల కలిసిండ్లు.

ఉత్తెర మబ్బోలె ఉరుములు– అసలేరు ఆనోలె ముసురుకున్నరు. దొర బంగుల సుట్టు జనం.... ఎవని మొఖం సూసినా భగభగమండే మంటలే....

"ఎక్కడి జనం? ఎట్ల కూడిండ్రు జనం! సెప్పుకింది సీమల తీర్గ అంచిన నడుమెత్తకుంట పన్జేసే జనాని కెక్కడిదీ బలం?...."

దొరకు పిచ్చిలేసినట్టుగున్నది.... కిటికీ పీకేయాలనుకున్నడు.

జనం అరుపులాగినయ్– కేకలాగినయ్– పాటలాగినయ్– బంగుల మీద మనుషులు జనానికి కన్పిత్తండ్లు.

884

భీమయ్య మొత్తుకున్నడు....

"ఇగో దొరా! మంచి మాటకు జెప్పుతన్నమ్.... అట్టన్నాయెంగ మావోల్లను బంగులల కట్టేసినవ్.... ఇవ్వార్దనుక మా కొంపలార్పినవ్- పైకం గక్కాలె.... గుంజుకున్న భూములిడిసిపెట్టాలె...."

బంగులల నుంచి సప్పుడులేదు....

"ఊళ్లెనుంచి ఎల్లగొట్టినోల్ల భూములు ఎవరియాల్లకు ఇయ్యాలె"

"ఓరి లంజకొడక నాదగ్గెర దండుగని నెలకోపారి ఓడిచ్చుకుంటివిగాదురా! నోరుమంచిదిగాక నేనన్నాకొద్ది మాట మాటకు నూరంటివిగాదురా! తలెమంత లమ్మిత్తివిగాదురా!" పొట్టిగున్నరైతు గిదగిద పెద్దరువాజల కురికిండు.

ఒక్కొక్కలే.... దొర ఏమేమి సేసిందో సెప్పుతంద్రు. మాటలిన్నాకొద్ది జనం పిడికిల్లు బిగుసుకుంటన్నయ్....

"తూ! నీ పుటుకు గాల.... ఆడిదాన్ని సూత్తే మారేసిసూత్తవు గాదురా...." ఎవలో కదెంబద్దలు తాకిచ్చుకుంట చెప్పింది.

"నీ బంగుల తవ్వి పారేత్తం.... దిగిరా!"

అరుపులు....

ఎవడో రాయిసిరిండు....

సప్పుడులేదు.... రాయి బంకుల పెంకలమీద 'టొక టొక' జారింది.

ఇంకెవడో పెద్దరువాజ పాటకుల పాకిండు.

ఆకిట్ల రక్తాలు కార్తన్న రైతుల జూసి అవల దునికిండు.

తుపాకి పేలింది.... లోపలికి దిగిన మనిషి కాలి సీలమండల్ల నుంచి గుండు దూసకపోయింది.... అట్లనే పట్టుకొని ఉరికి ఒక్కొక్కల కట్లిప్పిండు.

జనంల తర్జన భర్జనలు.... ఎండ ఎక్కవోతంది.... తిట్లు శాపనార్థాలు....

"నీ తుపాకులు తూటుకొమ్ములేం జెయ్యయి-" ఎవడో అరిచిండు.

జనం కదిలిండ్లు....

లోపటికి దిగిన మనిషి పాటకులు తెరిసిండు- తుపాకి గుండ్లు ఒళ్ళంత దిగుతనే ఉన్నయ్-

జనం పాటకుల్లకు సొచ్చుకపోయిండ్లు....

తుపాకులు మొరుగుతనే ఉన్నయి....

885

భీమయ్య ఒరిగిపోయిండు.

ఝుయ్యి ఝుయ్యిన తుపాకి మోగుతనే ఉన్నది.

జనంలో తొక్కిసలాట.... కింద బడేటోల్లు పడ్తనేవున్నరు. ఎవలు ఎనుకకు పోత లేరు.... సేతికందిన రాళ్లు రువ్వుతంద్రు.

ఎప్పుడచ్చిండ్లో బర్రుబర్రున జీపుల్ల పోలీసోల్లచ్చిండ్లు.... పోలీసోల్లు సోద్యం సూసుకుంట నిలుసుండంగనే బంగులమీన్నుంచి తుపాకి కాల్పులు జర్గుతనే ఉన్నయ్....

ఆడామె గిదగిద అమీను సాబు జీపుకాడికురికింది.

"అచ్చిండ్లా.... వాడు సూడుండ్లి బాంచెన్ గింత పంది మా మొగోల్ల పిట్టల గాల్చినట్టు కాలుత్తండు.... నీ బాంచెన్ మీ కాడ గా తుపాకులున్నయ్. ఆళ్లకు ఎదురు సెప్పుండ్లి లాకపోతే ఆపుమని సెప్పుండ్లి...."

అమీను సాబు మైకుల "రైతులారా! ప్రశాంతంగా ఉండండి- లేకుంటే కాల్పులు జర్గుతయి...."

"నీ బాంచెన్ తమరు గదే మాటంటరా!" ఇందాకటామె.

అమీను సాబు వినిపిచ్చుకోలె.

"వాన్ని అరెట్టు సెయ్యుంద్రి బాంచెన్- సత్తండ్లు బాంచెన్, సత్తండ్లు-" గొంతికె తెగిపోయెటట్టు అరిచింది.

"రైతులూ ప్రశాంతంగా...." అమీను....

"ఓరి నీ సావు నిర్వావుగాను- నా సీరె గాజులు నువ్వు తొడుక్కోరాదు. గ బట్టలు నాకియ్యి, తుపాకి నా సేతికియ్యి- అన్ని అరెట్టు సేత్తా-" కాండ్రకిచ్చి ఊంచింది.

జనం పోలీసోల్ల దిక్కు తిరిగింద్రు-
"మీరు ఆనికి మద్దతచ్చిండ్లా...."
"తన్నుంద్రి- ఈల్లు ఆళ్ల బంట్లే...."
పోలీసుల తుపాకులు గాలిల మొరిగినయ్.
ఎవలో ఎత్తు బండెక్కిండు.
"మనండ్ల ఒక్కలం మిగులం...."
జనంల అలజడి....
ఎవలో ఏడుత్తండ్లు పేగులు నోట్లెకచ్చేటట్టు-
ఎవలో తిడుతండ్లు గొంతికె తెగిపోయేటట్టు-

886

ఎవలో....

"అగం.... మండుతంది- నాకో తుపాకి గావాలె- తుపాకి.... సత్తానం.... కాలిపోతన్నం...."

"లంజకొడుకులు" ఒక్క పలుసటి రైతు కారే నెత్తురుతోటి అటిటు ఉరుకు తండు.

మరి కాసేపటికి పొగలుగక్కె తుపాకుల్ల రైతులు నెత్తుర్లు కారే మొఖాలతోటి అగిపోయిండ్లు- ఏడుపులు ఆకసం ముట్టినయ్.

5

తెల్లారి దొరల పేపర్లు మజ్జె పేపర్ల మూలకు వింతవార్త అచ్చొత్తినయ్-

"ఆదివారప్పేటలో కాల్పులు....

మొన్న సాయుధ దుండగులు శ్రీ రంగారావు వారిమీద కత్తులు, కటార్లు, గొడ్డండ్లతో దాడి చేశారు- ఆత్మరక్షణార్థం రంగారావుగారు జరిపిన కాల్పుల్లో ఇద్దరికి స్వల్ప గాయాలు తాకినయ్. పోలీసులు హుటాహుటిన ఆ ప్రదేశానికి వెళ్ళి పరిస్థితిని అదుపులోనికి తెచ్చినట్టు నేడిక్కడ ఆలస్యంగా అందిన వార్తలవల్ల తెలుస్తున్నది. శాంతిభద్రతలు నెలకొల్పినందుకు మంత్రి నారాయణరావుగారు పోలీసులను అభినందించారు. ఇప్పుడు పరిస్థితి ప్రశాంతంగా ఉన్నది "

అదేరోజు పేపరు నిండా తాడికాయలంత అక్షరాలతో-

"దేశంలో విద్రోహక చర్యలు నానాటికి పెచ్చరిల్లుతున్నాయి- సంఘ విద్రోహక శక్తులను ప్రభుత్వం ఎంతమాత్రం సహించబోదు-" అని గాంధీగారి జీవిత చరిత్ర ఆవిష్కరించుతూ ముఖ్యమంత్రి గన్నారెడ్డి ప్రకటించారు.

కాని రైతుల్లో అగ్ని రగులుకొంటనే ఉన్నది.

కుంపటి "చిటపట - పటచిట" ఇంకా మండుతనే ఉన్నది.

వెలువడింది :

పరేశ్‌ధార్ సంపాదకత్వాన నక్సల్బరీతరం బెంగాలీ కవితా సంపుటి

ఇంగ్లీషులో

మండుతున్న దశాబ్దం

(బర్నింగ్ డికేడ్) వెల: మూడు రూపాయలు

ప్రతులకు: ఉచ్చారణ్, 2/1, శ్యామచరణ్ దే స్ట్రీట్, కలకత్తా - 700 073.

887